క్లుప్తంగా

'కంటి వెలుగు'కు విశేష స్పందన



గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లో కంటి వెలుగు కేంద్రాల వద్ద ఉదయం నుంచి కంటి పరీక్షల కోసం ప్రజలు బారులు తీరుతున్నారు. బుధవారం గుడిమల్కాపూర్‌లోని కంటి వెలుగు కేంద్రంలో బీజేపీ నాయకుడు దేవర వంశీ కంటి పరీక్షలు చేయించుకున్నారు.

ఆరె కటికలను ఆదుకోండి



సాయిబాబాకు వినతిపత్రం అందజేస్తున్న అశోక్‌కుమార్, దినేష్ తదితరులు

అబిడ్స్: ఆరె కటికెల కులవృత్తిని ఆదుకోవాలని ఆరె కటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర నాయకుడు కేడి దినేష్ డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం మటన్ క్యాంటీన్లను ప్రభుత్వమే ప్రారంభిస్తుందని ప్రకటించడం దారుణమన్నారు. రాష్ట్ర టీడీపీ నాయకులు సాయిబాబాకు వినతిపత్రం అందేసి ఆరె కటికలకు టీడీపీ అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వేలాది మంది ఆరె కటిక కులస్తులు మటన్‌తోనే జీవితం గడుపుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం స్వయంగా మటన్ క్యాంటీన్లు పెడితే తాము ఎలా జీవించాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాగేషు, నందీశ్వర్ పాల్గొన్నారు.

అన్నదానం



గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులకు రాత్రిపూట భోజనం ప్యాకెట్లు అందజేస్తున్నామని గోల్కొండ ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీరుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద అన్నదానం నిర్వహించారు.

విశ్వకర్మ యోజన పథకంపై హర్షం

గన్‌ఫౌండ్రీ: భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారి విశ్వకర్మల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టం ఎంతో ఆనందంగా ఉందని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా విశ్వకర్మలు ఆకలి చావులతో ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం చేతివృత్తులను గుర్తించి వారి కోసం ప్రత్యేక పథకాన్ని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఫెన్సింగ్ పనుల పరిశీలన



గోల్కొండ: బుల్కాపూర్ నాలాకు పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు, షేక్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫర్హాజుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీ, అజీజ్‌బాగ్, సబ్జాకాలనీల్లో పర్యటించారు. ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులతో పాటు ఫెన్సింగ్ పనులను కూడా పరిశీలించారు. ఆయన వెంట పలువురు మజ్లిస్ నాయకులు ఉన్నారు.

వార్షికోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: రాయల్ జూనియర్ కాలేజీ వార్షికోత్సవాన్ని మెహిదీపట్నంలోని రూఫ్ గార్డెన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉమెన్ సేఫ్టీ డీఐజీ బి.సుమతి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని, పట్టుదలతో ఏదైనా సాధ్యమే అన్నారు. రాయల్ గ్రూప్ చైర్మన్ కే.జనార్దన్‌రెడ్డి, డైరెక్టర్ క్రిష్టారెడ్డి హాజరయ్యారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వీధి కుక్కలతో పరేషాన్

- గౌలిపురా డివిజన్‌లో వీధి కుక్కల బెడద
- భయాందోళనకు గురవుతున్న స్థానికులు
- సమస్య పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు



పటేల్‌నగర్‌లో గుంపులుగా వీధి కుక్కలు



గౌలిపురా కమేలా ప్రాంతంలో..

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రమవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. డివిజన్‌లోని పటేల్‌నగర్, సర్దార్ పటేల్‌నగర్, అంబికానగర్, హనుమాన్‌నగర్, అయోధ్యనగర్ కాలనీ, శ్రీరాం నగర్‌కాలనీ, దానయ్యనగర్, ఛత్రినాక, గౌలిపురా చౌరస్తా, అచ్చయ్యనగర్, అయోధ్యనగర్, హనుమాన్‌నగర్ ఫేస్–3 తదితర ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేయడంతో అటు వైపు నుంచి రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు పాదచారులు బెంబేలెత్తుతున్నారు. కుక్కల బెడద కారణంగా చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రోడ్లపై ఒంటరిగా వెళ్లడానికి జంకుతున్నారు. తెల్లవారుజామున గ్రామ సింహాలు గుంపులుగా తిరుగుతున్నాయని.. ఇళ్ల ముందు తిష్ట వేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉదయం వేళల్లో వాకింగ్, ఇతర పనుల నిమిత్తం బయటికి వెళ్లడానికి భయం వేస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. అర్ధరాత్రి సమయంలో వాహనదారులపై గుంపులుగా ఉన్న ఒకేసారిగా దాడులకు దిగడంతో వారు తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రి పాలైన ఘటనలు పలుమార్లు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుక్కల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బయటకి వెళ్లలేకపోతున్నాం



కుక్కల బెడద కారణంగా ఉదయం వేళల్లో వాకింగ్‌కు వెళ్లలేకపోతున్నాం. కూరగాయలు, పాలు నిమిత్తం బయటకి వెళ్లేందుకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కుక్కల దాడితో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కల బెడదను నివారించాలని పలుమార్లు సంబంధిత అధికారులను కోరాం. అధికారులు పట్టించుకోవడం లేదు.

– తుపాకుల దుర్గేశ్ కుమార్, హనుమాన్‌నగర్

వాకింగ్ చేయలేకపోతున్నాం..



కుక్కల బెడద కారణంగా ఉప్పుగూడ రైల్వే బ్రిడ్జి సమీపంలో వాకింగ్ చేయలేకపోతున్నాం. రైల్వే ట్రాక్ సమీపంలో కల్లు కాంపౌండ్ ఉండటంతో కుక్కలు అందులో ఉన్న మాంసం, వ్యర్థ పదార్థాలను తినడానికి పెద్ద సంఖ్యలో గుమ్మిగూడుతున్నాయి. దీంతో ఆర్‌యూబీ చుట్టూ వాకింగ్ చేయాలంటే కుక్కలను చూసి చాలా మంది మహిళలు జంకుతున్నారు.

– కాలే శ్రవంతి, ఉప్పుగూడ

కుక్కల బారి నుంచి కాపాడాలి..



పనుల నిమిత్తం బయటికి వెళ్లి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి రావాలంటే జంకుతున్నాం. కుక్కలు రాకపోకలు సాగించే సమయంలో ఒకేసారి మీదకే వచ్చేసరికి భయంతో కిందపడిపోతున్నాం. ఒంటరిగా వెళ్లే వారిని టార్గెట్ చేసుకొని కుక్కలు దాడులు చేస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలి.

– ధనుంజయ గౌడ్, అంబికానగర్

శుభాకాంక్షలు



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న నవీన్ మిట్టల్, టీజీటీఏ ప్రతినిధులు

దబీర్‌పురా: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులైన నవీన్ మిట్టల్‌ను బుధవారం తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ (టీజీటీఏ) ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 నూతన సంవత్సర కేలండర్‌ను నవీన్ మిట్టలతో కలిసి ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ ఎస్.పి.ఆర్.మల్లేష్ కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా అభిషేక మహోత్సవం



అభిషేక మహోత్సవంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులు తదితరులు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం భీష్మ ఏకాదశి శ్రీ విష్ణు సహస్రనామ జయంతి సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి రెండు గంటల వరకు శ్రీ వేంకటేశ్వర స్వామికి పంచామృతములతో అభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మహోత్సవం జరిగింది. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ యుగంధర్ రెడ్డి, ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.జయంతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గన్‌ఫౌండ్రీ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం అబిడ్స్‌లోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు హన్మేష్ మాట్లాడుతూ.. కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు రిటైర్డ్‌మెంట్ తర్వాత ప్రతినెలా రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ప్రసన్న, రాందాస్, వెంకటేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

18న శివ మహా జాగరణ



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న నరేష్‌గౌడ్, మోహన్‌గౌడ్ తదితరులు

జియాగూడ: శ్రీ శివ మహా జాగరణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని శ్రీ మహా శివరాత్రి జాగరణ సేవా సమితి అధ్యక్షుడు నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌గౌడ్, కన్వీనర్ రాజ్‌కుమార్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పురనాపూల్ రహింపురా సత్తన్నగల్లీలో గల శ్రీ శంకర్‌జీ, హనుమాన్‌జీ అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈనెల 18న మహా శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని శ్రీ మహా శివరాత్రి జాగరణలో భాగ్యనగర్ మహాశక్తి యువ మండల్ భజనలు ప్రముఖ గాయకులు టి.రవిసింగ్, మనోజ్ శర్మ, ఎస్. రాజన్‌కుమార్, నిర్వహిస్తుండగా మౌంటీ నటరాజన్ గ్రూప్ (ఢిల్లీ వారిచే) వివిధ దేవతల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమ వ్యాఖ్యతగా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ కామెంటేటర్ మల్లేష్‌యాదవ్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సీహెచ్. ప్రదీప్‌కుమార్, డి.రాజేందర్ సింగ్, టి.సచిన్‌రాజ్‌సింగ్, డి.గోవింద్‌రావు, జి.బాల్‌రాజ్‌గౌడ్, జనగాం పాండు, గోపిశెట్టి ప్రమోద్‌కుమార్, అశోక్ చౌహాన్, రాజు, సాయికుమార్, ఎస్.రామ్‌నాథ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. చందులాల్ బారాదరి సబ్ స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. రియాసత్‌నగర్, రక్షాపురం, తానాజీనగర్ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదన్నారు. ఉమర్ కాలనీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. అన్వర్ మిర్చి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. ఉప్పుగూడ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు. సీ–బ్లాక్, నీలం సెంటర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

చార్మినార్ ఏసీపీగా రుద్ర భాస్కర్



భిక్షం రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న రుద్ర భాస్కర్

చార్మినార్: చార్మినార్ లా అండ్ ఆర్డర్ నూతన ఏసీపీగా రుద్ర భాస్కర్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు చార్మినార్ ఏసీపీగా బాధ్యతలు నిర్వహించిన భిక్షంరెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో రుద్ర భాస్కర్ నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రుద్ర భాస్కర్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో విధి నిర్వహణ కొనసాగిస్తూ ఫ్రెండ్లీ పోలీసుగా పని చేస్తామన్నారు.

సంతోష్‌నగర్ ఏసీపీగా మహ్మద్ గౌస్



శ్రీనివాస్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న మహ్మద్‌గౌస్


సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ డివిజన్ నూతన ఏసీపీగా మహ్మద్ గౌస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన శ్రీనివాస్‌రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పని చేస్తున్న ఆయనను సంతోష్‌నగర్ ఏసీపీగా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శ్రీనివాస్‌రెడ్డి నుంచి బుధవారం మహ్మద్ గౌస్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు.

బాధ్యతల స్వీకరణ



ప్రసాద్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న దామోదర్‌రెడ్డి

యాకుత్‌పురా: మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీగా సూదీరెడ్డి దామోదర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌రావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో సీసీఎస్‌లో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న దామోదర్‌రెడ్డిని నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. 1995 బ్యాచ్‌కు చెందిన దామోదర్‌రెడ్డి గతంలో దక్షిణ మండలం పరిధిలోని శాలిబండ, చాదర్‌ఘట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్సైగా విధులు నిర్వహించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది నిజామాబాద్ బాన్సువాడ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు.



సాక్షి, సిటీబ్యూరో: వరల్డ్ హిజాబ్ డే పురస్కరించుకుని బుధవారం ముస్లిం మహిళలు, యువతులు ఘనంగా జరుపుకున్నారు. కులమతాలకతీతంగా రంగురంగుల హిజాబ్ వస్త్రాలను యువతులు, బాలికలకు అందజేశారు.

ఫిష్ క్యాంటీన్ ప్రారంభం



ఫిష్ క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

విజయనగర్‌కాలనీ: రకరకాల చేపలతో కూడిన వంటకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం శాంతినగర్‌లోని మత్స్యశాఖ కార్యాలయం ఆవరణలో రూ.25 లక్షలతో నూతనంగా అభివృద్ధి చేసిన ఫిష్ క్యాంటీన్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపల వినియోగాన్ని పెంచేందుకు చేపల వంటకాలపై మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రారంభించిన ఉచిత చేపల పిల్లల పంపిణీతో మత్స్య సంపద గణనీయంగా పెరిగినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులందరికీ అందించాలనే ఉద్దేశంతో మత్స్య సొసైటీలలో సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పశు సంవర్ధక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అదర్‌సిన్హా, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరామ్ భూక్యా, పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్, అధికారులు మంజువాణి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాస్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టోలీచౌకిలో ఎమ్మెల్యే పర్యటన



టోలీచౌకిలో పర్యటిస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలీచౌకి డివిజన్‌లో వరద ముంపు నివారణకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలీచౌకి డివిజన్ మజ్లిస్ నాయకుడు హారూన్ ఫర్హాన్‌తో కలిసి డివిజన్‌లో పర్యటించారు. ఆయన బాల్‌రెడ్డినగర్, హిరాసత్‌నగర్ కాలనీల్లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన కాలనీవాసులతో మాట్లాడారు. ఓ వైపు బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులు, మరోవైపు శాతం చెరువు అభివృద్ధి పనులతో టోలీచౌకి డివిజన్‌కు శాశ్వతంగా వరద ముప్పు తప్పిందన్నారు. శాతం చెరువు చుట్టూ అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అక్కడ గార్డెన్‌తో పాటు పాదచారుల కోసం ప్రత్యేకంగా ట్రాక్ నిర్మించడం జరుగుతుందన్నారు. శాతం చెరువుకు అదనపు తూము ఏర్పాటుతో వర్షాకాలంలో చెరువు నిండి నదీం కాలనీకి ముంపునకు గురికాదన్నారు.

వేగవంతంగా వాటర్‌బోర్డు పనులు చేయిస్తాం



వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్‌తో సమావేశమైన బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అబిడ్స్: వాటర్ బోర్డు అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టేందుకు కృషి చేస్తామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. వాటర్‌బోర్డు నాల్గవ డివిజన్ జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్‌తో ఆనంద్‌కుమార్‌గౌడ్ సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. మోంజామార్కెట్‌లో సీవరేజీ పనులు, సుభాన్‌పురాలో వాటర్, సీవరేజీ పనులు, ఎస్‌డీనగర్‌లో సీవరేజీ పనులు చేపట్టాలని జీఎంకు ఆనంద్ కుమార్‌గౌడ్ వివరించారు. సంబంధిత అధికారులకు వెంటనే పనులు చేపట్టేందుకు ఆదేశాలు ఇస్తున్నట్లు జాన్ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి తలసాని సహకారంతో అన్ని ప్రాంతాల్లో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. వాటర్‌బోర్డుతో పాటు జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖల పనులు సైతం మంత్రి తలసాని సహకారంతో వేగంగా చేపడుతున్నట్లు తెలిపారు. తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుకుమార్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అధికారులు, కార్పొరేటర్లతో కలిసి పర్యటిస్తున్న యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ తెలిపారు. బుధవారం ఆయన నియోజకవర్గం పరిధిలోని తలాబ్‌కట్టా, భవానీనగర్, నషేమాన్‌నగర్, ఖాన్‌నగర్, గంగానగర్ నాలా, యాకుత్‌పురా, నాగబౌలి, డబీర్‌పురా తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పలు ప్రాంతాల్లో తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్‌చంచలం, డబీర్‌పురా కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, ఆలంధార్ వాల్‌జాహీ, మజ్లిస్ పార్టీ ఆమన్‌నగర్–బీ ఏరియా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మోహీనుద్దీన్, నాయకులు మహ్మద్ అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆలయ ప్రతినిధులు

జియాగూడ: జియాగూడలోని ఇంద్రానగర్ నల్లపోచమ్మ మాతేశ్వరి ఆలయ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజుల పాటు ఘనంగా జరిగాయి. బుధవారం మాతేశ్వరీని అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అఖండ దీపారాధ, హోమం, సాయంత్రం పల్లకిసేవా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి, అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, సలహాదారులు చెన్నయ్య, వెంకటేష్, కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు వెంకటేష్, సురేష్, బర్ల యాదయ్య, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ భేష్



కార్పొరేటర్ లాల్‌సింగ్

అబిడ్స్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉందని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీ ప్రభుత్వ బడ్జెట్ ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందన్నారు. అన్ని వస్తువులపై ధరలు తగ్గించడం ఎంతో ప్రశంసించదగినదన్నారు. సంవత్సర ఆర్థిక కాల పరిమితి పెంచడం ఎంతో అభినందనీయమన్నారు. కొత్త ఆదాయ పన్ను విధానం ద్వారా అన్నివర్గాల ప్రజలు ఎంతో సంబరపడుతున్నారన్నారు. గృహ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా మహిళలు ఎంతో అభివృద్ధి చెందుతారని లాల్‌సింగ్ పేర్కొన్నారు.

ఆదాయ పన్ను పెంపుపై ఉపశమనం



హరిప్రసాద్ గోగికర్

అబిడ్స్: కేంద్ర బడ్జెట్ ఎంతో ఆశాజనకంగా ఉందని పబ్లిక్ రిలేషన్ ప్రొఫెషనల్ హరిప్రసాద్ గోగికర్ పేర్కొన్నారు. కేంద్రబడ్జెట్‌లో 7.5 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేనందునా జీతాలు పొందే వ్యక్తులు, పెన్షనర్లు ఎంతో ఉపశమనం పొందుతున్నారన్నారు. వ్యవసాయరంగానికి, రైతులకు రుణాలు పెంచడం ఎంతో అభినందనీయమన్నారు. మోదీ ప్రభుత్వ బడ్జెట్ ఎంతో సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. భారతదేశంలోని అన్నివర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను రూపొందించారని హరిప్రసాద్ అన్నారు.

ఉద్యోగులకు కొత్త బడ్జెట్ నిరాశ మిగిల్చింది



నరేందర్ రావు

సుల్తాన్‌బజార్: ఎనిమిది ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగులకు కొత్త బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిలించిందని టీఎస్‌సీపీఎస్ హైదరాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు నరేందర్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనాల్లో కోతలు తప్ప కొత్తగా ఊరటను ఇచ్చిన అంశాలు ఏమీ లేవన్నారు. పన్ను పరిధిని కొత్త పద్ధతిలో రూ.7 లక్షలకు పెంచినా ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదన్నారు. పాత పద్ధతిలో 5 స్లాబ్‌లు పెంచినప్పటికీ ఉపయోగం లేదన్నారు. కొనుగోలు శక్తి తగ్గినప్పటికీ, ధరలు వంద రెండు వందల శాతం పెరిగినవి కానీ ఉద్యోగులు ఆశించిన ఊరట లభించలేదన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు 80 డి క్రింద ఇచ్చే 50 వేలకు మినహాయింపుల్లో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు